



ఓబుళదేవరచెరువు మండలం నారప్పగారిపల్లిలో నేలకొరిగిన వరిపంట

వర్షానికి నేలకొరిగిన వరి పంట

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు, రొద్దం

మండల వ్యాప్తంగా గురువారం కురిసిన వర్షానికి పలుచోట్ల వరి పంటలు నేలకొరిగాయి. దీంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. నారప్పగారి పల్లెలో రెడ్డిపల్లి రాజారెడ్డి, రామచంద్ర, దీప తదితరులకు చెందిన పంటలు పంటలు నేలకొరిగాయి. రెండు రోజుల్లో పంట చేతికి వచ్చే సమయంలో తుపాన్ ప్రభావం వల్ల వర్షం తమకు నట్టేట ముంచిందని రైతులు ఆవేద వ్యక్తం చేస్తున్నారు. పంట కోతకుకొచ్చే ఉంటే ఎకరాకు 40 బస్తాలు వరి దిగుబడి వచ్చేదని ప్రస్తుతం వర్షం ప్రభావంతో కనీసం ఐదా ఆరు బస్తాలు కూడా దక్కడం కరువేనని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

రొద్దం : మండలంలో గురువారం కురిసిన గాలివాన ధాటికి మండలంలోని వివిధ గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని ఆర్.మరవపల్లిలో రైతు ఆంజనే యులు సాటు చేసిన వరి పౌరు పంట నేలకొరిగింది. అలాగే కంచిసముద్రంలో మహిళా రైతు రామాం జనమ్మకు చెందిన 1.2 ఎకరాల పొలంలో వరి పంట మొత్తం పూర్తిగా వాలిపోయింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



రొద్దం మండలంలోని కంచిసముద్రంలో నేలవాలిన వరి పంట





◆ బడ్జెట్‌లో నిధులు అతి స్వల్పం
◆ ఎన్నికల హామీలపై ప్రస్తావనే లేదు..
◆ సందిగ్ధంలో ముడిపట్టు సబ్సిడీ.. నేతన్న నేస్తం..!
◆ కూటమి తొలి బడ్జెట్‌పై నేతన్నల పెదవివిరుపు

చే'నేత'కు నిరాశ..!

చేనేత కార్మికుని అద్భుత ప్రతిభతో పట్టుచీరకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. హ్యాండ్లూమ్ మగ్గంపై కార్మికుడు తయారు చేసిన చీర మగువకు మణిహారంగా నిలిచింది. పోగుపోగూ పేర్చి అందమైన హరివిల్లులాంటి చీరను తయారు చేసిన నేతన్న ప్రస్తుతం సంక్షోభంలో కూరుకుపోయాడు. ప్రభుత్వాలు, పాలకుల నిర్లక్ష్యంతో ఈ రంగం రానురానూ తిరోగమనంలో పడింది. వృత్తిలో ఆదాయం లేక కార్మికులు ఉపాధికి దూరం అయ్యే పరిస్థితి ఏర్పడింది. గతంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షల్లో ఉన్న మగ్గాలు రానురానూ వేలల్లోకి, వేలల్లో ఉన్నవి వందల్లోకి చేరే పరిస్థితి వచ్చింది. చేనేతల అభివృద్ధి గురించి నిత్యం మాటలు వల్లేవేసే పాలకులు ఆచరణలోకి వచ్చే సరిగా నిర్లప్తత ప్రదర్శిస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లోనూ నేతన్నకు మరోసారి నిరాశే ఎదురయ్యింది. బడ్జెట్ కేటాయింపులు చూస్తే ప్రభుత్వం ఈ రంగాన్ని కనీసం పరిగణలోకి కూడా తీసుకున్నట్లు కన్పించడం లేదంటూ కార్మికులు నిట్టూరుస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురంలో జిల్లాలో చేతివృత్తుల పనులు చేసుకుని జీవించే వారిలో చేనేత కార్మికులే అధికం. ధర్మవరం, హిందూపురం, ముదిరెడ్డిపల్లి, సోమందేపల్లి, ఉరవకొండ, సిండికేట్ నగర్, యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు, చెన్నేకొత్తపల్లి, గోరంట్ల, నల్లమాడ, నల్లచెరువు తదితర మండలాల్లో చేనేత కార్మికులు జీవనం సాగిస్తున్నారు. ఈ వృత్తిపై దాదాపు లక్ష కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. గతంలో వీరి సంఖ్య 1.50 లక్షలు ఉండేది. పాలకుల నిర్లక్ష్యంతో రానురాను చేనేత వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయింది. ముఖ్యంగా ముడిసరుకుల ధరలు పెరగుదల, పవర్‌లూమ్స్, ప్రభుత్వ నిరాదరణ, చీరలకు గిట్టుబాటు ధరల లేకపోవడం తదితర కారణాలతో చేనేత రంగం కుదేలేంది.

బడ్జెట్‌లో మొండిచేయి

కూటమి ప్రభుత్వం ఇటీవల శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ చేనేత వర్గాలను తీవ్ర నిరాశకు గురి చేసినట్లు తెలుస్తోంది. దశాబ్ద కాలంగా చేనేత పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంతో చేతినిండా పనిలేక నేతన్నలు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న రుణభారంతో వృత్తికి దూరం అవుతున్నారు. అప్పులను తీర్చలేక చాలా మంది ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో చేనేతలకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను బడ్జెట్‌లో అమలు చేసేలా కేటాయింపులు ఉంటాయని నేతన్నలు ఆశించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబు నాయుడు ఉమ్మడి జిల్లాలో పర్యటించిన సందర్భంగా చేనేతలు ఉన్న ప్రతి ప్రాంతంలోనూ వారికి అనేక హామీలు ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం చేనేతను పూర్తిగా విస్మరించిందని తాము అధికారంలోకి వస్తే ఆదుకుంటామని చెప్పారు. ఈ హామీలపై నమ్మకంతో గత ఎన్నికల్లో చేనేతలందరూ కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక 2024-25 బడ్జెట్‌ను చూస్తే ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు పొంతన లేకుండా ఉంది. నూలు సబ్సిడీ, స్థానిక మార్కెట్ అవకాశాలు పెంపొందించుకునేందుకు వినియోగదారులకు వస్త్ర కొనుగోలుపై ఇచ్చే 20 శాతం రిబేట్ ఊసేలేదు. ముడిపట్టు రాయితీ, నేతన్న నేస్తం, చేనేత కార్మికులకు గృహాలు, ఉచిత వైద్యం, జీఎస్టీ ఉపశమనం తదితర వాటి గురించి నామమాత్రపు ప్రస్తావన కూడా లేదు. ఇటీవల విజయవాడలో జరిగిన చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు చేనేతల ఆరోగ్య భద్రతను తన బాధ్యతగా స్వీకరిస్తున్నానని చెప్పి హెల్త్ ఇన్సూరెన్స్ పథకం అమలుకు రూ.10 కోట్లు ప్రకటించారు. సోమవారం నాడు ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఎక్కడా ఆ పథకం అమలుకు సంబంధించి నిధుల కేటాయింపులు జరగలేదు. చేనేతలకు పెనుభారంగా ఉన్న జీఎస్టీ రద్దు చేయించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, అందుకు అవసరమైన చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని, కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోతే రాష్ట్రంలోని చేనేతలు చెల్లిస్తున్న జీఎస్టీ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. దీనిపై కూడా కూటమి ప్రభుత్వం ఎలాంటి స్పష్టతనూ ఇవ్వలేదు. ఇవి కాకుండా చేనేతలకు సొంతిళ్లు, ముడిపట్టు రాయితీ, బ్యాంకు రుణాలు, హెల్త్‌కార్డులు, నేతన్న నేస్తం, చేనేత అనుబంధ రంగాల కార్మికుల సంక్షేమం తదితర దేని మీద బడ్జెట్‌లో ప్రస్తావన చేయలేదు. మొత్తం పరిశ్రమలు, వాణిజ్య శాఖ బడ్జెట్ రూ.4371.42 కోట్లు కాగా అందులో చేనేతలకు కేటాయించింది కేవలం 4.42 శాతం అంటే రూ.193.19 కోట్లు. రాష్ట్ర బడ్జెట్ మొత్తం రూ.2,94,427.25 కోట్లు అంచనా కాగా, చేనేతలకు కేవలం 0.066 శాతం మాత్రమే కేటాయింపులు చేయడంపై చేనేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ముగ్గురు మంత్రులున్నా...







ఈ సారి బడ్జెట్‌లో చేనేతకు కేటాయింపులు ఆశాజనకంగా ఉంటాయని భావించడానికి ప్రత్యేక కారణం ఉంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులూ ప్రత్యక్షంగా చేనేత కార్మికులతో సంబంధం ఉన్నా వారే కావడం విశేషం. బడ్జెట్‌ను ప్రవేశపెట్టే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఇక రాష్ట్రంలోనే అత్యధిక మంది చేనేత కార్మికులున్న ధర్మవరం నియోజకవర్గం నుంచి ఎన్నికైన సత్యకుమార్ యాదవ్ ముగ్గురు మంత్రులూ ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వారే. ముగ్గురు మంత్రులూ చేనేతతో అనుబంధం ఉన్న వారే అయినా ఆ రంగానికి బడ్జెట్‌లో నిధులు తక్కువగా రావడంపై నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేనేతకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

ప్రస్తుతం చేనేత పరిస్థితి దయనీయంగా ఉంది. వృత్తిని నమ్ముకుని ఏళ్ల తరబడి జీవనం సాగిస్తున్నా అందులో ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నాం. కనీసం రోజు కూలి దక్కని పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఆదుకుంటేనే చేనేత కార్మికుల జీవనం ముందుకు సాగుతుంది. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేతను నిరాశకు గురిచేసింది. నామమాత్రపు కేటాయింపులు కూడా చేయలేదు. ఇచ్చిన కొద్దిపాటి నిధులు కూడా కార్మికునికి చేరే పరిస్థితి లేదు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవర్చేందుకు చేనేతకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలి.

రామచంద్ర, చేనేత కార్మికుడు, ధర్మవరం.

గిరిజనులకు సాగు పట్టాలు ఇవ్వాలి

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జిల్లాలో గిరిజనులు అటవీ భూములను గత 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని, వారందరికీ సాగు పట్టాలను మంజూరు చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. ఈ విషయంపై శుక్రవారం శాసనసభలో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గిరిజనులు, గొర్రెలు, మేకలు, చిరు వ్యాపారులకు రుణాలు ఇవ్వకుండా రద్దు చేశారన్నారు. గిరిజనుల సాంఘిక సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఎస్టీ కార్పొరేషన్‌ను వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. పుట్టపర్తి నియోజకవర్గం రాగానిపల్లితండా, నారాయణప్ప తండా, చెరువు మునియప్ప గారి తండాలకు సరైన రహదారి లేక గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీటి పై ప్రభుత్వం స్పందించి తగిన నిధులు మంజూరు చేయాలని ఆమె కోరారు.

అటవీ శాఖ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-పెనుకొండ



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అటవీశాఖ అధికారులు

పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయంలో శుక్రవారం అటవీ శాఖ సిబ్బందికి అడవుల సంరక్షణ, జంతువుల గుర్తింపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎం స్ట్రిప్ అప్లికేషన్ వినియోగంపై జిల్లా అటవీశాఖ క్షేత్రస్థాయి సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి హాజరై మాట్లాడారు. క్షేత్రస్థాయి సిబ్బంది అడవిలో తిరిగినప్పుడు అడవులను సంరక్షించుట, జంతువుల ను గుర్తించి వాటి పాదముద్రికలు, వెంట్రుకలు, పిచ్చుకలను గుర్తించడం, సంరక్షించడం వంటి వివరా లను యాప్‌లో నమోదు చేయాలన్నారు. శ్రీశైలం బయో డైవర్సిటీ అధికారి ధనరాజ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజినల్ అధికారి జిపి.ఆనంద్, కదిరి, బుక్కపట్నం, పెనుకొండ అటవీ అధికారులు గుర్రప్ప, యామిని, సరస్వతి, శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ అటవీ క్షేత్ర అధికారులు శివరామ్, హుసేనప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్‌గా డివి ఆంజనేయులు

ప్రజాశక్తి-సోమందేపల్లి



మంత్రులు లోకేష్, సవితలను కలిసిన డివి.ఆంజనేయులు

మండలంలోని నాగినాయినిచెరువు గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు డివి ఆంజనేయులును రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించి నట్లు ఆయన తెలిపారు. దీంతో శుక్రవారం పలువురు వాల్మీకి సామాజికవర్గం ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆంజనేయులును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రులు లోకేష్, సవిత తనపై నమ్మకం ఉంచి డైరెక్టర్‌గా నియమించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టిడిపిలో కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను ప్రతి వాల్మీకి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటానని, వాల్మీకులు ఆర్థిక, సామాజిక, విద్యారంగాల్లో అభివృద్ధి చెందేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

18న కనకదాసు జయంతి

ప్రజాశక్తి-పెనుకొండ



మాట్లాడుతున్న రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు

ఈ నెల 18వ తేదీ అనంతపురంలో నిర్వహిస్తున్న కనకదాసు 537వ జయంతి మహాసభను జయప్రదం చేయాలని రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర, నియోజకవర్గ కురుబ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇందులో మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ మన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడానికి మంచి అవకాశం అన్నారు. మహాసభలో మంత్రి సవిత, ఎంపిలు బికె.పార్థసారధి, నాగరాజు, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రఅధ్యక్షులు బోరంపల్లి ఆంజనేయులు, బిల్లా నరేంద్ర, బాలాజీ, వెంకటేశులు, రామాంజనేయులు, గోరంట్ల నారాయణస్వామి, పెద్దన్న, వెంకట రాముడు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

ప్రజాశక్తి-మడకశిర



డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును కలిసిన ఎమ్మెల్యే రాజు

ఎపి అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణంరాజు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ ఎంఎస్.రాజు మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే, శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణంరాజును ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. దీంతో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని గుట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో రమేష్ మాట్లాడారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18వ తేదీ కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. వైసిపి హయాంలో కుదిరిన ఒప్పందాల మేరకు జీవోలు, సర్క్యులర్లు ఇవ్వాలని సిఎం చంద్రబాబుకి వివిధ రూపాలోల వినతి పత్రాలు ఇచ్చినా ప్రభుత్వం నుంచి స్పందించ లేదన్నారు. ఆశా వర్కర్లకు సాధారణ మెటర్నిటీ లీవులు ఇవ్వాలని, రాజకీయ, అధికారుల వేధింపులు ఆపాలని, సంబంధం లేని పనులు చేయించకూడదని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, గ్రూపు ఇన్సూ రెన్స్ సౌకర్యం కల్పించాలని, తదితర డిమాండ్లపై ధర్నాకు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు పుల్లమ్మ, సుమంగళి, రాజేశ్వరి, అలివేలమ్మ, తులసి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని కల్లుమర్రి పిహెచ్‌సిని శుక్రవారం జిల్లా మలేరియా అధికారి ఓబులు సందర్శించారు. ఆయన వైద్య సిబ్బందితో సమావేశమై దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ల్యాబ్‌ను తనిఖీ చేసి రక్తపూతల పరీక్ష విధానంపై సూచనలు ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమానికి హాజరై దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్‌గన్యా, తదితర జబ్బులకు నివారణ పద్ధతులను తెలిపారు. దోమల లార్వాలను నిర్మూలించే మార్గాలను వివరించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా, శివన్న, కార్యాలయ సీనియర్ సహాయకులు సురేష్, సిహెచ్‌ఒ హుసేన్‌బి, సూపర్ వైజర్లు రామ్‌ప్రసాద్, సరస్వతి, ఎఎన్ఎం విజయ, ఆశా కార్యకర్తలు శాంతమ్మ, కవిత, తదితరులు పాల్గొన్నారు.



వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు

విద్యారంగ సమస్యలపై 18న మహాధర్నా : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ ఐ నాయకులు

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18వ తేదీ విజయవాడలోని ధర్నాచౌక్‌లో చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం జాప్యం చేస్తుదన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ కేటాయింపుల్లో బకాయిల గురించి మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతి ఇస్తామని యాజామాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయన్నారు. తల్లికి వందనంపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని, అమలుపై ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. జీఓ 77 రద్దు చేస్తామన్న చంద్రబాబు ఆ ఊసే ఎత్తడంలేదన్నారు. ఆర్భాటంగా తీసుకొచ్చిన డిగ్రీ హానర్స్ విధానం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని, వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే పున:ప్రారంభించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టళ్లలో మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై ఇప్పటికే మండల, జిల్లా కార్యాలాయల వద్ద ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. దీంతో ఈ నెల 18వ తేదీ విజయవాడ ధర్నా చౌక్‌లో మహాధర్నాకు పిలుపునిచ్చామని, విద్యార్థులు కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్, సాయికృష్ణ, భరత్, ఫయాజ్, అజయ్, అనిల్, మంజు, మహేష్, చందు పాల్గొన్నారు.

నాసిన్, బెల్ భూనిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా



ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో బైఠాయించిన నాసిన్, బెల్ నిర్వాసితులు

నాసిన్, బెల్ భూ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లింపుల విషయం స్పష్టం చేసి అర్హుల జాబితా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూ నిర్వాసితులు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో బైఠాయించి ధర్నా చేపట్టారు. దీంతో ఆర్డీవో ఆనంద్ కుమార్ కార్యాలయ ఏవో గిరిని పిలిపించి అర్హుల జాబితా ఇవ్వాలని చెప్పి గ్రామ సభకు వెళ్లిపోయారు. ఏవో ఇచ్చిన జాబితాలో పాలసముద్రం గ్రామానికి సంబంధించిన వారి పేర్లు ఒక్కటీ లేకపోవడంతో ఆవేదన చెందిన భూ నిర్వాసితులు ఒక్కసారిగా ఏవో ఛాంబర్‌ని చుట్టుముట్టి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ నిర్వాసితులు అర్జీలు పెట్టుకున్నా, హైకోర్టు ఆదేశించిన మూడేళ్ల తర్వాత కూడా అధికారులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలుపై అవగా హన లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. హైకోర్టు సూచించిన నిర్వాసితుల జాబితాను పరిగణలోకి కూడా తీసుకోకుండా అధికారులు వివక్ష చూపారని దుయ్యబట్టారు. తక్షణం రీ సర్వేకు అనుమతించి న్యాయం చేసేంత వరకూ నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీంతో రెవ్యూ అధికారులు, పోలీసులు, నిర్వాసితులు, నాయకుల మధ్య కొద్దిసేపు వాదనలు జరిగాయి. చివరకు ఏవో ఫోన్ ద్వారా ఆర్డీవోకి విషయం తెలిపి ఆయన ఆదేశాల మేరకు నిర్వాసితుల నుంచి వినతిపత్రం తీసుకొని వాటిని పరిశీలించి ఖచ్చితంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, నారాయణ, నార్పింపల్లి ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశ్వర్లు, భూ నిర్వాసితులు గంగమ్మ, వెంకటలక్ష్మమ్మ, అచ్చుమ్మ, రమీజమ్మ, కదిరప్ప, మారుతి, వెంకట్రామిరెడ్డి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

18న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - గాండ్లపెంట

ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని ఆశ వర్కర్ల యూనియన్, సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షులు బి సాంబశివ, మండల నాయకులు అక్కులప్ప, నరసింహులు, ఆంజనేయులు కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం 26వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు లక్ష్మీదేవి, శకుంతల, పార్వతి, జ్యోతి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లో ఆధార్ వారోత్సవాలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఆధార్ వారోత్సవాలు నవంబర్ 19 నుండి 22 వరకు, 26 నుండి 29 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సాయిమనోహర్ తెలిపారు. గ్రామాల్లోని విద్యార్థులు, ప్రజలు ఆధార్ కార్డు లో వుండే చిన్న చిన్న తప్పులను సరిచేసుకోవడానికి ఇది మంచి అవకాశమని చెప్పారు. ఈ క్యాంపులకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు అందరు తప్పక హాజరు కావాలని ఆదేశించారు.

బిందుసేద్యంపై అవగాహన

ప్రజాశక్తి - నల్లచెరువు

స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏపీఎంఐపీ పిడి సుదర్శన్ ఆధ్వర్యంలో బిందు, తుంపర సేద్యంపై అవగాహన కల్పించారు. 5 ఎకరాల లోపు భూమి ఉన్న వారికి 90, అంతకంటే ఎక్కువ భూమి ఉన్న వారికి 70 శాతం సబ్సిడీతో బిందు సేద్య పరికరాలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న రైతులకు ఈ పథకాలను వర్తింపజేయాలని సూచించారు..ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భారతి , ఉద్యాన శాఖ అధికారి లావణ్య, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా బేకరీ గంగాధర్

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని కోడూరు గ్రామానికి చెందిన బేకరి గంగాధర్‌ను ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. తెలుగుదేశం పార్టీ లో సాధారణ కార్యకర్తగా ఉంటూ సామాజిక ఉద్యమాలల్లో చురుకుగా పాల్గొంటున్న బేకరి గంగాధర్‌ను ప్రభుత్వం గుర్తించి ఈ పదవిని కట్టబెట్టింది. బేకరీ గంగాధర్‌కి ఎమ్మెల్యే బాలక్రిష్ణ వద్ద ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన చొరవతోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో తనకు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అవకాశం వచ్చిందని గంగాధర్ తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన పదవిని బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తానని ఆయన తెలిపారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై సిపిఎం ఫిర్యాదు



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

నియోజకవర్గ పరిధిలోని ముదిగుబ్బ మండలం జొన్నల కొత్తపల్లి సమీపంలో ప్రభుత్వ భూమి కబ్జాను అరికట్టాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు ఆలకుంట మారుతీ, ఆటో పెద్దన్న, సిఐటియు నాయకులు అయూబ్ ఖాన్, ఎల్ ఆదినారాయణ,నాగార్జునల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్మవరం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. జెకె. పల్లికి చెందిన సర్వే నెంబర్ 50, 51,49-ఏ నంబర్ల లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు అనధికారికంగా సాగులో ఉన్నారని అన్నారు. ఈ నేపథ్యంలో గత ఆగస్టు నెలలో స్థానిక తహశీల్దార్‌ను కలిసి ఆ ప్రభుత్వ భూమిని సొంత ఇల్లు లేని పేదలకు పంచాలని కోరామన్నారు. ఆ సమయంలో కొందరు రాజకీయ నాయకులు దౌర్జన్యంగా ఆ భూమి ని కాజేసి ఏకంగా ప్లాట్లుగా వేసి సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యపై ధర్మవరం ఆర్‌డిఒకు ఫిర్యాదు చేయడానికి వచ్చామన్నారు. ఆయన అందుబాటులో లేకపోవటంతో కార్యాలయ ఇన్‌ఛార్జి లక్ష్మిదేవికి వినతిపత్రం అందజేశారన్నారు.

పట్టు రైతులు, రీలర్లను ఆదుకోండి

ప్రజాశక్తి-హిందూపురం

గత ప్రభుత్వాలు పట్టు రైతులను, పట్టు రీలర్లను పూర్తిగ విస్మరించాయని...ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టు రైతులకు, పట్టు రీలర్లకు ఇవ్వాల్సిన ప్రోత్సహకాలను విడుదల చేసి ఆదుకోవాలని పట్టు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సిద్దారెడ్డి, సిల్క్ రీలర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్. ఖాజ, ముస్తఫా కోరారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఎప్పుడు శాసన సభలో పట్టు రైతులు, రీలర్ల సమస్యలపై చర్చించ లేదన్నారు. అయితే మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు శాసనసభలో సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం హర్షనీయమన్నారు. గత వైసిపి ప్రభుత్వం పట్టు పరిశ్రమను పూర్తిగ విస్మరించింది అన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రోత్సహకాలు రూ. 60కోట్లు విడుదల కావాల్సి ఉందన్నారు. ఒక్క హిందూపురంలోనే దాదాపు రూ.6కోట్ల వరకు బకాయి ఉందన్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం బకాయి ప్రోత్సహకాలు విడుదల చేసి పట్టు రైతులను, రీలర్లను ఆదుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం పట్టు రైతులకు, పట్టు రీలర్లకు ఇచ్చే రాయితీలు ఇచ్చి ఆదుకోక పోతే పట్టు రీలర్లు పూర్తిగా నష్ట పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పట్టు రైతు సంఘం నాయకులు నవీన్, పట్టు రీలర్స్ అసోసియేషన్ నాయకులు ఎ. బాసా, దాదాపీర్, ఖలీల్, రహీం బేగ్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పట్టు రైతులు, రీలర్లు

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం

18న జరిగే మహాధర్నాను జయప్రదం చేయండి
ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి బిసి వసతి గృహంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు రూ.3,480 కోట్ల విడుదలకు ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇప్పటికే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం జాప్యం చేస్తూ కల్లిబొల్లి మాటలు చెప్తుందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లోని బడ్జెట్‌లో కేటాయింపులలో పెండింగ్ బకాయిల గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. విద్యార్థులు ఫీజులు చెల్లించ లేక పడరాని పాట్లు పడుతున్నారన్నారు. ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతులు ఇస్తామని, యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 84 లక్షల మంది విద్యార్థులకు రూ.12,600 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. అయితే రూ.5,387.03 కోట్లే బడ్జెట్‌లో కేటాయించారని తెలిపారు. దీంతో తల్లికి వందనంపై ఉన్న అనుమానాలు పెరిగాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అమలుపై స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ అంశాలపైన ఇప్పటికే మండల, జిల్లా కార్యాలయాల్ వద్ద ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం ఏలాంటి స్పందన లేదని, దీంతో రాష్ట్ర వ్యాప్త విద్యార్థులందరిని కలుపుకుని ఈ నెల 18న విజయవాడ ధర్నా చౌక్‌లో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, తరుణ్,హుస్సేన్, రాజు, హుసేన్, అఫ్రిద్, లిఖిత్, పాల్గొన్నారు.

జైలులో ఒత్తిడికి గురి కావొద్దు


జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్


ఖైదీలకు సూచనలిస్తున్న డిఎల్ఎస్ఎ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

ప్రజాశక్తి-హిందూపురం

క్షణికావేశంలో తప్పులు చేసి జైళ్లకు వచ్చే ఖైదీలు జైలులో ప్రశాంత వాతావరణంలో ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. ఒత్తిళ్లకు లోనై ఇబ్బందులకు గురి కావద్దన్నారు. శుక్రవారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీల వివరాలను, ఏయే కేసుల్లో నిందితులుగా ఉన్నారు, ఎప్పటినుండి కారాగారంలో ఉంటున్నారు, న్యాయవాదులు ఉన్నారా తదితర అంశాలను నేరుగా ఖైదీలతోనే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేసి జైళ్లకు వచ్చి ఉంటారని, కనీసం జైలులో అవసరమైనంత సమయం ఉంటుందని, మార్పు దిశగా ఆలోచన సాగించాలని అన్నారు. జైళ్లకు రావడం వల్ల వ్యక్తిగత, కుటుంబ మర్యాదలు, ప్రతిష్ట దెబ్బతింటుందని పేర్కొన్నారు. దీనికి తోడు ఆర్థికంగా కూడా ఇబ్బందులు పడాల్సి ఉంటుందని తెలిపారు. కారాగారంలో ఉన్నంతకాలం మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలని చెప్పారు. జైలు అధికారులు ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతివారం తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించాలని, అవసరమైన ఖైదీలకు ప్రతిరోజు ఆరోగ్య పరీక్షలు చేయించి మందులు ఇప్పించాలన్నారు. ప్రస్తుతం జైలులో గాయాలతో ఇబ్బందులు పడుతున్న ఖైదీలు ఉన్నారని, అలాంటి వారికి వెంటనే వైద్య చికిత్సలు చేయించాలని ఉపకారాగారాధికారి హనుమన్నకు సూచించారు. కాగా ఉచిత న్యాయ సహాయం అవసరమైన ఖైదీలు తెల్లకాగితంపై దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ఖైదీలు తమ కేసుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు బంధువులు, తమ న్యాయవాదులతో తరచూ ములాఖత్‌లో పాల్గొనేలా చూడాలన్నారు. అనంతరం ఆయన సబ్ జైలు గదులు, వంటగది, ఉచిత న్యాయ సహాయ కార్యాలయం తదితర వాటిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, న్యాయవాదులు సుదర్శన్, నవేరా, హబ్సా, శివ, లోక్ అదాలత్ సిబ్బంది హేమవతి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో బిర్సా ముండా పోరాటం ఆదర్శనీయం


బిర్సాముండా చిత్రపటానికి కలెక్టర్ నివాళి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ వ్యక్తి బిర్సా ముండా నిలిచారని కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ సమావేశం మందిరంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ విజయ సారథి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, తదితరులు ముండా చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిర్సాముండా బ్రిటిష్ పాలనను వ్యతిరేకిస్తూ అనేక పోరాటాలు చేశారన్నారు. దేశ స్వతంత్రం కోసం ఆయన జైలు జీవితం గడిపారన్నారు. అంతటి మహానుభావులను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

కదిరి అర్బన్ : విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని జాయింట్ కలెక్టర్ అఖిలేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన బిర్సా ముండే జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. చిన్న వయసులోనే తెల్లదొరలను తరిమికొట్టి మన స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన బిట్స్ ముండే జయంతి వేడుకలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా చేపడుతోందన్నారు. ఈసందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన సమరయోధులకు నివాళులర్పించి వారి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వర్ ప్రసాద్, అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు ఖాలే నాయక్, శ్రీనివాసులు నాయక్, వసతిగృహ అధ్యాపకులు, వార్డెన్లు పాల్గొన్నారు.

సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న సత్యసాయి ట్రస్టీ రత్నాకర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్య సాయి జయంతి వేడుకలకు విచ్చేసే భక్తుల కోసం ట్రస్టు సమకూర్చిన నూతన బస్సును సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ ప్రారంభించారు. శుక్రవారం ప్రశాంతి నిలయంలో ట్రస్టు సభ్యులు, సేవాదళ్ సభ్యుల నడుమ ఈ నూతన బస్సును రత్నాకర్ ప్రారంభించారు. గతంలో రెండు బస్సులు ఉండగా ఇప్పుడు మరో బస్సును ట్రస్టు సమకూర్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి జయంతి వేడుకలు ఈనెల 18 నుంచి వేణుగోపాల స్వామి రథోత్సవంతో ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా దేశ విదేశీ భక్తులు, వృద్ధులు, వికలాంగులు కోసం ప్రశాంతి నిలయం నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

18 నుంచి సత్యసాయి జయంతి వేడుకలు

సత్యసాయి జయంతి వేడుకలు వేణుగోపాల స్వామి రథోత్సవంతో ప్రారంభం కానున్నాయి. 19 మహిళా దినోత్సవం కార్యక్రమం నిర్వహిస్తారు. 20, 21న భజనలు సాంస్కృతిక కార్యక్రమాలు, 22న సత్యసాయి యూనివర్సిటీ స్నాతకోత్సవం, 23న బాబా జయంతి వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకలకు ఇప్పటికే ట్రస్టు సభ్యులు తగిన ఏర్పాట్లు చేపట్టారు.

18న కనకదాసు జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కనకదాసు జయంతి వేడుకలను ఈనెల 18న పుట్టపర్తి పట్టణంలోని గణేష్ సర్కిల్ వద్ద ఉన్న సాయి ఆరామం అతిథిగృహంలో నిర్వహిస్తున్నట్లు వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్లపైనే మురుగు

ప్రజాశక్తి- కొత్తచెరువు

కొత్త చెరువులో పలు వీధుల్లో రోడ్లపై మురుగు నిల్వఉంటోంది. డ్రయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైనే మురుగునీరు పారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎస్సీ కాలనీలో డ్రయినేజీ లేకపోవడంతో మురుగునీరు ధర్మవరం ప్రధాన రహదారిపైకి రావడంతో ఆ రహదారి గుంతల పడి అందులో మురుగునీరు నిల్వ ఉంటోంది. బీసీ కాలనీ హాస్టల్లో వద్ద డ్రైనేజీ సరిగా లేకపోవడంతో అక్కడ మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఇలా గ్రామంలో అనేకచోట్ల డ్రయినేజీ సమస్య అధికంగా ఉంది.మార్కెట్ లోని సచివాలయం వద్ద, గ్రంథాలయం వద్ద, ఉర్దూ స్కూల్ వద్ద కాలనీ ప్రజలు చెత్తను వేస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. ఈవిషయంపై గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు: పల్లె

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

టిడిపిలో కష్టపడి పనిచేసిన సామాన్య కార్యకర్తలను పార్టీ అధిష్టానం గుర్తించి ప్రభుత్వంలో నామినేటే పదవులను కట్టబెడుతోందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. అందుకు గోనుగుంట్ల కోటేశ్వరరావు నిదర్శనమని అన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గా ఎంపికైన గోనుగుంట్ల కోటేశ్వర రావును మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి శుక్రవారం శాలువాతో సన్మానించి సత్కరించారు. అమరావతి లోని 5 వ బ్లాక్ సచివాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఎన్నికైన కోటేశ్వరరావు నేరుగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వద్దకు విచ్చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈసందర్భంగా పల్లె మాట్లాడుతూ ఒక సామాన్య కార్యకర్తను పార్టీ అధిష్టానం గుర్తించి ఉన్నత పదవులు కట్టబెట్టిందనడానికి ఇదే నిదర్శనం అన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీలో తప్పకుండా న్యాయం జరగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రితోపాటు పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య నిపుణులు శుక్రవారం నిర్వహించారు. పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజు పల్లి సమీపంలో గల విజ్ఞాన్ నర్సింగ్ కళాశాల లో వైద్యాధికారి డాక్టర్ మునిచంద్రిక ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థినులక, వైద్య పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి, న్యుమోనియా, డ్రైడే ఫ్రైడే, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమములో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, ఎఎంఒ లక్ష్మి నాయక్, సబ్ యూనిట్ అధికారులు రమణయ్య, గోపీనాయక్, విజ్ఞాన్ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ నారాయణ రెడ్డి, అడ్మిన్ నరేంద్ర, ఫాకల్టీ సునంద, ఎంఎల్‌హెచ్‌పి అపర్ణ, ఆశా కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి పట్టణంలోని కేఎన్ఎల్, సైనిక నవోదయ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది నిర్వహించే నవోదయ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కెఎన్ఎల్ ఇన్యుస్ట్యూట్ నిర్వాహకులు రమేష్ తెలిపారు. దరఖాస్తు చేసుకొన్న 5, 8 వ తరగతులు చదువుతున్న వారికి ఈ నెల 18 వ తేదీ నుంచి జనవరి 18 వరకు స్థానిక కేఎన్ఎల్ సైనిక నవోదయ కోచింగ్ సెంటర్‌లో 2 నెలలు పాటు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 5, 8 వ తరగతులు చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9398629919 నెంబరుకు సంప్రదించాలని ఆయన కోరారు.

పశు సంపద పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పశు సంరక్షణ, వాటి గణాంకాలు నిష్పక్షపాతంగా తయారు చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడీ శుభదాసు పేర్కొన్నారు. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సెమినార్, నిర్వహించారు. మేకలు గొర్రెలు పెంపకంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని పుట్టపర్తి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి శుభ దాస్, డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ గిరిజమ్మ, పెంచలయ్య, నాగరాజు, చంద్రశేఖర, రామచంద్ర పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు ,డాక్టర్లు పశుసంవర్ధక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సైబర్ నేరాలు అసాంఘిక కార్యకలాపాలు గంజాయి, ఆన్లైన్ మోసాలు బాల్య వివాహాలు తదితర సమస్యలపై విద్యార్థులకు జిల్లా పోలీసులు అవగాహన కార్యక్రమాలను పలుచోట్ల శుక్రవారం నిర్వహించారు. పెనుగొండ ,పుట్టపర్తి సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీలు విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పెనుగొండ సబ్ డివిజన్లోని పరిగి, ఒడిసి మండలాలలో సైబర్ క్రైమ్, మత్తు పదార్థాలు, ప్రస్తుతం మహిళల పై జరుగుచున్న దాడుల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పరిగి జూనియర్ కళాశాలలో పెనుగొండ సిఐ రాఘవన్ ఎస్ఐ, ఒడిసి జూనియర్ కళాశాలలో నల్లమాడ సిఐ నరేందర్ రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున రెడ్డిలు, ఈ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజాన్ని సురక్షితంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

కాంగ్రెస్ పుట్టపర్తి ఇన్‌ఛార్జిగా 'దాదిరెడ్డి'

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

కాంగ్రెస్ పార్టీ పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి నియామక పత్రాలు శుక్రవారం అందినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇన్‌ఛార్జిగా నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలకి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - బుక్కపట్నం

ఈనెల 11న రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యా శాఖా మంత్రి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు చెన్నక్రిష్ణారెడ్డిని శుక్రవారం సన్మానించారు. వైఎస్ఆర్‌టిఎ శాఖ అధ్యక్షులు పివి. రమణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతాప్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శంకర, సుబ్బారెడ్డి, రామోహన్ రెడ్డి, రాజేష్, రాజగోపాల్, మధుసూధన్ రెడ్డి, వాసు, నాగభూషణం, హనుమంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, సోమలా నాయక్ తతదిరులు పాల్గొన్నారు.

17న మూర్ఛవ్యాధి చికిత్సా శిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉదయం 10 గంటల నుంచి పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డులో ఉన్నా అల్ హి లాల్ పాఠశాల ఆవరణంలో ఉచిత మూర్ఛ వ్యాధి చికిత్సా శిబిరం ఏర్పాటు చేసినట్లు జెవివి అధ్యక్ష, కార్యదర్శులు పి. రామకృష్ణ, డాక్టర్ ఇటి. రామమూర్తి తెలిపారు. ఈ వైద్య శిబిరానికి ప్రముఖ న్యూరాలజిస్ట్ వైద్య నిపుణవులు గోపాలం శివనారాయణ హాజరు అవుతారన్నారు. మూర్ఛ వ్యాధి గ్రస్థులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాహనాల తనిఖీ

హిందూపురం : హిందూపురం నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారి కొడికొండ చెక్ పోస్ట్ వద్ద సిబ్బందితో రహదారికి ఇరువైపులా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ నిర్వహించినట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు.. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు జవహర్, సుధాకర్ రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లో ఇసుక రిజిస్ట్రేషన్

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పంచాయతీ కార్యదర్శి యాప్‌లో రిజిస్టర్ చేసుకుని ఇసుకను పొందవచ్చని కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానంపై మైన్స్ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా రాష్ట్ర రాజధాని నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ టిఎస్.చేతన్ హాజరయ్యారు. నదులకు ఆనుకుని ఉన్న గ్రామాల్లోని ప్రజల అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకువెళ్లడానికి మండలస్థాయి అధికారి అనుమతులు ఇవ్వాలని ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. ఇసుక కావాల్సినవారు సంబంధిత గ్రామ సచివాలయంలో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ పక్కాగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘనకు గురికాకుండా పర్యవేక్షణ పెరగాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక లభ్యత ఉన్న రెండు ప్రాంతాలను గుర్తించామన్నారు. ఇసుక కావాల్సిన వారు పంచాయతీ కార్యదర్శి యాప్‌లో రిజిస్టర్ చేసుకుని, రసీదును పొందిన తర్వాత ఇసుకను తీసుకు వెళ్లవచ్చన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్, మైన్స్ అధికారి పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న టిఎస్.చేతన్



వైసిపి నాయకులు పురుషోత్తంరెడ్డి కుమారుడిని పరామర్శిస్తున్న నాయకులు

వైసిపి నాయకుడి కుమారునికి పరామర్శ

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక వైసిపి నాయకులు పురుషోత్తంరెడ్డి కుమారుడు రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలిసి శుక్రవారం వైసిపి మండల కన్వీనర్ గజేంద్ర, టౌన్ కన్వీనర్ గోవిందమ్మగారి శ్రీనివాసులు, మాజీ సర్పంచి రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు వారింటికి వెళ్లి పురుషోత్తంరెడ్డి కుమారుడిని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పిటిసి డిసి.అశోక్, సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి, వైస్ ఎంపిపి వెంకటనారాయణరెడ్డి, ఎంపిటిసి సాయిరామ్, వార్డ్ మెంబర్ గూడూరు రమేష్, ఇమామ్ వలి, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో తిమ్మప్ప

విత్తన వేరుశనగకు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-మడకశిర

రబీ సీజన్‌లో బోరుబావుల కింద వేరుశనగ సాగు చేసే రైతులు రాయితీ విత్తన వేరుశనగ కోసం సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో తిమ్మప్ప తెలిపారు. శుక్రవారం నాడు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ క్వింటా పూర్తి ధర రూ. 9,600 కాగా 40శాతం సబ్సిడీ రూ. 3,840 పోనూ రైతు వాటా రూ. 5760 చెల్లించాలన్నారు. ఒక రైతుకు గరిష్టంగా 3 బ్యాగులు పంపిణీ చేస్తామని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



సోమందేపల్లి మండలం పందిపర్తిలో గ్రామసభలో పాల్గొన్న తహశీల్దార్ రెడ్డిశేఖర్



అగళి మండలం పి.బ్యాగిగెరలో గ్రామసభలో పాల్గొన్న తహశీల్దార్ సుబ్బారావు

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని పందిపర్తి గ్రామంలో తహశీల్దార్ రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహిస్తున్నామని ప్రజలు వారి సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాల న్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్వో అన్నపూర్ణ, పంచాయతీ కార్య దర్శి కైర్నిశపానం, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నాగేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అగళి : రైతుల భూ సమస్యలను సకాలంలో పరిష్కరించడానికి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ సుబ్బారావు తెలిపారు. మండలంలోని పి.బ్యాడిగెర గ్రామపంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. భూమికి సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా తెలిపితే పరిష్కరిస్తామని తెలిపారు. సదస్సులో ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్వో కుమారి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడిగా కాడిశెట్టి శ్రీనివాసులు

ప్రజాశక్తి-మడకశిర

స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఎస్‌టియు) రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లా వాసి అయిన కాడిశెట్టి శ్రీనివాసులు ఎన్నికైన సందర్భంగా డివిజన్ ఉపాధ్యాయులు శుక్రవారం పెనుకొండ పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అలాగే రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎంవి.కృష్ణారెడ్డిని సన్మానించారు. జిల్లా వాసి ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు కావడం సంతోషంగా ఉంద న్నారు. ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, పిఆర్సీ, డిఎ బకాయిలు, సిపిఎస్ రద్దు, తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పిఆర్‌సి ఆలస్యమవుతున్నందున ఐఆర్ ప్రకటించేలా పోరాడాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.మారుతి ప్రసాద్, హెచ్‌హెచ్.ప్రదీప్‌కుమార్, కె,మారుతి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



కాడిశెట్టి శ్రీనివాసులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని బూదిలి జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఎస్ఎంసి చైర్మన్ మారెప్ప, టిడిపి నాయకులు ఈడిగ రవి, బ్రహ్మయ్య, చంద్ర, రామచంద్ర మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని నాణ్యతగా రుచిగా, శుభ్రంగా అందించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం వారు పాఠశాలలోనే భోజనం చేశారు. వారి వెంట హెచ్ఎం వెంకటేష్, ఉపాధ్యాయులు షబ్బీర్, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు జయంతిని విజయవంతం చేయండి

కొత్తచెరువు : పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఈనెల 18న నిర్వహించే కనకదాసు జయంతిని విజయవంతం చేయాలని కురుబ సంఘం నాయకులు బోరంపల్లి ఆంజనేయులు, సామకోటి ఆదినారాయణ, కురుబ మల్లికార్జున తెలిపారు. కొత్త చెరువులోనే పోతులప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కనకదాసు జయంతి పోస్టర్లను ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కనకదాసు జయంతిని రాష్ట్ర పండుగ గుర్తించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం నాయకులు ఆదినారాయణ, చెన్నప్ప, రమేష్, శ్రీనివాసులు, సూరి, లక్ష్మీనారాయణ, నరసింహులు, రామప్ప, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఎపియుడబ్ల్యూజె ధర్మవరం డివిజన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి బత్తలపల్లి

ఏపీయుడబ్ల్యూజె ధర్మవరం డివిజన్ నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆసంఘం జిల్లా అధ్యక్షులు సి. పుల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా అధ్యక్షులు పుల్లయ్య. ఐజేయు కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మవరం డివిజన్ అధ్యక్షులుగా మోహన్, గౌరవాధ్యక్షులుగా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జాంపుల అజయ్ చౌదరి, ఉపాధ్యక్షులుగా వీరనారప్ప, వెంకటనాయుడు, నరేష్, వెంకటేష్ చౌదరి, రామకృష్ణ, రాంప్రసాద్‌ను ఎన్నుకున్నారు. అదే విధంగా సహాయ కార్యదర్శులుగా మహానందరెడ్డి,ఆదినారాయణ, గురుప్రసాద్, కప్పల హరికృష్ణ, ఆదినారాయణ, రమణను ఎన్నుకున్నారు. కార్యనిర్వహక కార్యదర్శిగా గణేష్, కోశాధికారిగా మహాదేవరెడ్డి, కార్యవర్గసభ్యులుగా మదనాపు రాజశేఖర్, గోపాల్, వెంకటేష్, సుబ్బరాయుడు, వీరనారప్ప, శ్రావన్‌కుమార్, నాగేంద్ర, నాగరాజు, రమణ, సాకే శ్రీనివాసులును ఎన్నుకున్నారు.

'విద్యా ప్రదాత గోవిందయ్య శెట్టి'

హిందూపురం : ఎంతో మంది విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దిన విద్యా ప్రదాత గోవిందయ్య శెట్టి అని వక్తలు కొనియాడారు. పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాల వ్యవస్థాపకులు దాసా గోవిందయ్య శెట్టి 123వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కళాశాల ఆవరణలోని ఆయన విగ్రహానికి కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేవూరి చంద్రమోహన్, బైసాని రాంప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ. ఈ ప్రాంతంలో కళాశాలను స్థాపించి గోవిందయ్య శెట్టి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. త్వరలోనే ఇంజనీరింగ్ విద్యను కూడా ఈ కళాశాలలో అందుబాటులోనికి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కమిటీ ప్రతినిధులు దాసా సురేష్, రమేష్ బాబు, సత్యనారాయణ, ప్రిన్సిపాల్స్ జెఎస్‌వి ఎస్ ప్రసాద్, నాగేంద్ర కుమార్, అధ్యాపకులు రాజన్న, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని తురకలాపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యు త్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. మండ లంలోని తురకలాపట్నం, కోగిర, సానిపల్లి, బొక్కసంపల్లి, ఈ.వెంకటాపురం గ్రామాలకు సరఫరా అయ్యే ఫీడర్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా ఉద యం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ అంతరాయం ఉంటుందన్నారు.

విద్యార్థులు పుస్తకాలు చదవాలి

ప్రజాశక్తి-రొద్దం

ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదవాలని, అప్పుడే మంచి ఆలోచనలు వస్తాయని గ్రంథాలయ అధికారి నాగరాజు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన చేపట్టారు. నాగరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే లైబ్రరీలో అందుబాటులో ఉన్న పుస్త కాలు చదివితే లోక జ్ఞానం వస్తుందన్నారు. కావున ప్రతి విద్యార్థి ప్రతి రోజూ గ్రంథాలయం వెళ్లి కనీసం అర గంట చదవడానికి సమయం కేటాయించాలన్నారు. విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించిన టిడిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

స్థానికమున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశాన్ని టిడిపి కౌన్సిలర్లు బహిష్కరించారు. ఈ సమావేశానికి 9 మంది మాత్రమే సభ్యులు హాజరయ్యారు. అయితే టిడిపి ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి ఆధ్వర్యంలో ఈ కౌన్సిల్ సమావేశాన్ని టిడిపి కౌన్సిలర్లు బాయికాట్ చేశారు. అనంతరం రత్నప్ప చౌదరి మాట్లాడుతూ సమావేశం నిర్వహించిన ప్రతిసారి కాంట్రాక్టర్లకు మేలు చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కనీసం సత్యసాయిబాబా 99వ జయంతి ఏ విధంగా నిర్వహించాలన్న ప్రణాళిక చేయకుండా ఈ కౌన్సిల్ సమావేశం నిర్వహించడం సరైన పద్ధతి కాదన్నారు. అందుకే తాము ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని తెలిపారు. పట్టణంలో పారిశుద్ధ్యం, వీధిలైట్లు, డ్రైనేజీ సమస్యపై పట్టించుకున్న పాపాల పోలేదన్నారు. వీధులన్నీ అపరిశుభ్రంగా మారి సమస్యల వలయంగా మారాయన్నారు. అలాగే గతంలో టెండర్లు పొందిన వారికే మళ్లీ వారికే టెండర్లు దక్కాయని విమర్శించారు.

వర్షానికి నేలకొరిగిన పంట పరిశీలన

గోరంట్ల : గురువారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీలో పలువురు రైతులు సాగు చేసిన వరి పంట నేలకొరిగింది. బాధిత రైతులు పంట నష్టంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం తహశీల్దార్ మారుతి వరి పంటను పరిశీలించారు. తహశీల్దార్ వెంట వీఆర్వో అశోక్, మాజీ సర్పంచి సుధాకర్‌రెడ్డి, టిడిపి నాయకులు నరేంద్ర, మని, శేఖర్‌రెడ్డి రైతులు ఉన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

హిందూపురం : పట్టణంలోని సూగూరు ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేయనున్న ఏకశిలా భారీ ఆంజనేయ స్వామి విగ్రహం కోసం మాజీ మున్సిపల్ చైర్మన్ జెవి అనిల్ కుమార్ రూ.2,07,000లు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ట్రస్ట్ అధ్యక్షులు వైసీ చంద్రశేఖర్ అనిల్ కుమార్ అందజేశారు.